హామీలు అమలు చేసిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డిదే



యోగేశ్వరరెడ్డి

హస్తినాపురం: గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు పరుస్తూ ప్రజల మన్ననలు పొందుతున్న ప్రజా ప్రభుత్వ ప్రతిష్టను దెబ్బతీసేందుకు ప్రతిపక్షాలు కుట్రలు చేస్తున్నాయని టీపీసీసీ అధికార ప్రతినిధి యోగేశ్వరరెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..పేద ప్రజల సంక్షేమం కోసం అనేక పథకాలు ప్రవేశపెట్టి వాటిని పకడ్బందీగా అమలు పరిచిన ఘనత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికే దక్కిందన్నారు. ప్రభుత్వం వైద్యం, విద్యకు ప్రాధాన్యమిస్తూ ముందుకు సాగుతున్నా కొంతమంది కావాలని ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని అలాంటివారి మాటలను ప్రజలు నమ్మేస్థితిలో లేరన్నారు. రాష్ట్రంలోని సంక్షేమ గురుకుల ఆశ్రమ పాఠశాలలో ఫుడ్ పాయిజన్ కుట్రకు బీఆర్ఎస్ నాయకులు తెర లేపారని, ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ గురుకుల సెక్రటరీగా ఉన్న సమయంలో హాస్టళ్లలో ఫుడ్ కాంట్రాక్టర్లు, వర్కర్లను నామినేటెడ్ పద్ధతిలో నియమించడం జరిగిందని వాళ్లే ఇప్పటికీ కొనసాగుతున్నారన్నారు. వారితో ఉన్న సంబంధాలను ఆసరాగా చేసుకుని ప్రభుత్వ ప్రతిష్టకు భంగం కలిగేలా ప్రవీణ్‌కుమార్ కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



నియామక పత్రం అందజేస్తున్న పురుషోత్తం రావు

నాగోలు: మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తూ అభ్యున్నతి సాధించాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ శ్రీనివాస్ పేర్కొన్నారు. మున్నూరు కాపు మహిళ పరస్పర సహాయ వినియోగదారుల సహకార సొసైటీ లిమిటెడ్ డైరెక్టర్‌గా నియామకమైన న్యూమారుతినగర్‌కు చెందిన ఆల్వారి శైలజ ప్రదీప్ పటేల్‌కు రాష్ట్ర అధ్యక్షుడు సర్దార్ పుట్టం పురుషోత్తం రావు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న శ్రీనివాస్ మాట్లాడుతూ.. మహిళలు సమన్వయంతో పని చేస్తూ ఆర్థికాభివృద్ధికి పాటు పడాలని మహిళా సంక్షేమం, అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో లలిత, అనిల్ కుమార్, శ్రీరామ్ శెట్టి అన్నపూర్ణ, ప్రవీణ్ కుమార్, విష్ణు, జగత్, రఘు పాల్గొన్నారు.

పేదలకు వరం సీఎంఆర్‌ఎఫ్



ఎల్‌ఓసీ అందజేస్తున్న మధుయాష్కీ గౌడ్

హస్తినాపురం: పేద ప్రజలకు సీఎం రిలీఫ్ ఫండ్ వరం లాంటిదని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ గౌడ్ అన్నారు. హస్తినాపురం డివిజన్ పరిధిలోని నందనవనం కాలనీకి చెందిన రిజ్వాన్‌ఖాన్‌కు సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరైన రెండున్నర లక్షల రూపాయల ఎల్‌ఓసీని స్థానిక కార్పొరేటర్ సుజాతానాయక్‌తో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా మధుయాష్కీ గౌడ్ మాట్లాడుతూ.. పేదల ఆరోగ్య పరిరక్షణకు సీఎం సహాయనిధి దోహదపడుతుందని, అర్హులంతా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి, రామ్మోహన్‌గౌడ్, చంద్రశేఖర్‌రెడ్డి, దర్గా శ్రీను పాల్గొన్నారు.

కంఠ మహేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం



విగ్రహ ప్రతిష్ఠాపనలో పాల్గొన్న ఆలయ కమిటీ సభ్యులు



ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిని సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

నాగోలు: కొత్తపేట గ్రామం సత్యనగర్ కాలనీలో కంఠ మహేశ్వర స్వామి, గణపతి, సుబ్రహ్మణ్యేశ్వర స్వామి, నంది వాహనం బలిపీఠం, వన మైసమ్మ, రేణుకా ఎల్లమ్మ దేవి శిఖర నూతన ప్రతిష్ఠాపన మహోత్సవం ఆదివారం కొత్తపేట గౌడ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. బ్రహ్మశ్రీ రావిరాల పరమేశ్వర శాస్త్రి ఆధ్వర్యంలో ఉదయం నుంచి ఆలయంలో పూజలు నిర్వహించారు. స్వామి వార్ల శాంతి కల్యాణం, మహాపూర్ణాహుతి, నీరాజన మంత్ర పుష్పాలు నిర్వహించారు. అనంతరం అన్నప్రసాద వితరణ చేశారు. సోమవారం బోనాల ఉత్సవాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కి, కొత్తపేట కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్, మాజీ కార్పొరేటర్ వజీర్ ప్రకాష్‌గౌడ్, లింగాల నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.

న్యూ మాస్టర్‌మైండ్‌లో కామర్స్ ఫెస్ట్



మాట్లాడుతున్న సీఈఓ హోలీధర్‌రెడ్డి

బడంగ్‌పేట్: ప్రతి విద్యార్థి ప్రతిభ, విజ్ఞానాన్ని ప్రదర్శించి ఉన్నతిగా ఎదగాలని స్ఫూర్తి గ్రూప్ ఇన్‌స్టిట్యూషన్స్ సీఈఓ హోలిధర్‌రెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక జూనియర్ కళాశాలలో కామర్స్ ఫెస్ట్–2024ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. వాణిజ్యంలో పారదర్శకత, నైతిక పద్ధతులు, బలమైన నియంత్రణ, ఫ్రేమ్ వర్క్‌ల ప్రాముఖ్యతను వివరించారు. సూచించారు. దేశంలో జరిగిన ఆర్థిక మోసాల గురించి పేర్కొన్నారు. కళాశాల కార్యదర్శి డాక్టర్ పాండు మాట్లాడుతూ.. వ్యాపార పద్ధతులపై సాంకేతిక, ఏ1 పరివర్తన ప్రభావాన్ని హైలెట్ చేస్తుందన్నారు. ఏ1 వ్యాపారం నిర్వహించే విధానాన్ని విప్లవాత్మకంగా మార్చాయని గుర్తుచేశారు. అమెజాన్ వంటి ఈ కామర్స్ దిగ్గజాలు షాపింగ్ అనుభవాలు వ్యక్తీకరించడానికి ఉత్పత్తులను సిఫార్స్ చేయడానికి ఇన్వెంటరీని సమర్థవంతంగా నిర్వహించడానికి ఏ1 ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ డా.జగన్‌మోహన్‌రావు, డైరెక్టర్లు ఎన్.నాగేంద్ర లగడపాటి, ప్రిన్సిపాల్స్ శ్రీనివాస్‌రెడ్డి, నవనీత, వాణిజ్య విభాగాధిపతి శ్రీధర్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

కురుమ సంఘం కమిటీ ఎన్నిక

మీర్‌పేట: మీర్‌పేట(జిల్లెలగూడ) కార్పొరేషన్ కురుమ సంఘం నూతన కమిటీని ఆదివారం సంఘం జిల్లా అధ్యక్షుడు సిద్దాల దశరథ్ ఆధ్వర్యంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడిగా దెవిరింటి వెంకటేశ్ కురుమ, ఉపాధ్యక్షులుగా అచ్చిని యాదగిరి కురుమ, సిద్దాల శ్రీనివాస్ కురుమ, ప్రధాన కార్యదర్శిగా ప్యాట నర్సింహ, కార్యదర్శిగా అచ్చిని కార్తిక్, కోశాధికారిగా సిద్దాల కృష్ణ, కార్యవర్గ సభ్యులుగా సిద్దాల జగదీశ్, జోగు శ్రీశైలం ఎన్నికయ్యారు. కురుమ సంఘం రాష్ట్ర ఎన్నికల అధికారి కిష్టగోని సదానందం సమక్షంలో కమిటీని ఎన్నుకున్నామని, త్వరలోనే సంఘం నూతన సంవత్సర కేలండర్‌ను ఆవిష్కరిస్తామని సిద్దాల దశరథ్ తెలిపారు.



సంఘం నూతన కమిటీ సభ్యులు



ఓ ప్రాంతంలో ఇలా..

అసాంఘిక కార్యకలాపాలకు.. అడ్డుకట్ట పడేనా?

- రోడ్లపై అసభ్యకర ప్రవర్తన
- ఇబ్బందులు పడుతున్న స్థానికులు
- పోలీస్ గస్తీ పెంచాలని వేడుకోలు

నాగోలు: ఎల్‌బీనగర్ పలు ప్రాంతాలు అంసాఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయి. పోలీస్ గస్తీ లేకపోవడంతో ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. ఎల్‌బీనగర్ పరిధిలోని ఆర్టీసీకాలనీ, శివగంగాకాలనీ, కామినేని హాస్పిటల్ ప్రధాన రహదారి, ఎల్‌బీనగర్ శారద వైన్స్, ఎస్‌బీఐ కాలనీ ప్రాంతంలో నిత్యం ఇదే తంతూ కొనసాగుతుందని అటుగా రాకపోకలు సాగించే వారు అసహనం వ్యక్తం చేస్తున్నారు. రాత్రి, రోడ్డుపై నిలబడి రాకపోకలు సాగించే వాహనదారులను అసభ్యకర సైగలతో ఇబ్బందులకు గురి చేస్తున్నారు. ఆయా ప్రాంతాల్లో పోలీసులు పెట్రోలింగ్ చేయకపోవడంతో వారు ఆడిందే ఆటగా మరింది. అర్ధరాత్రి అయితే చాలు వనస్థలిపురం, గుర్రంగూడా, ఆటోనగర్, దిల్‌సుఖ్‌నగర్ పరిసర నిర్మానుష్య ప్రాంతాల్లో ప్రధాన రహదారుల పక్కన కొందరు మహిళలు, యువతుల అసభ్యకర దుస్తుల్లో నిలబడుతున్నారు. రాత్రి సమయాల్లో అటు వైపు వెళ్తే రెడ్ లైట్ ఏరియాలుగా తలపిస్తున్నాయని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

నిఘా పెంచితేనే అడ్డుకట్ట..

ఎల్‌బీనగర్ కామినేని హాస్పిటల్ సమీపంలో ఉన్న అనేక లాడ్జిల్లో వ్యభిచార కేంద్రాలకు అడ్డాగా మారాయి. అక్కడ పోలీసులు ఎలాంటి దాడులు చేయకపోవడంతో హోటళ్లు, లాడ్జిలలో ఇవే కొనసాగుతున్నాయి. వాటిపై పోలీసులు నిఘా ఏర్పాటు చేయాలని స్థానిక కాలనీవాసులు కోరుతున్నారు. ఆర్టీసీ కాలనీలో అపార్ట్‌మెంట్‌లో ఏర్పాటు చేసిన హోటళ్లు, లాడ్జిలలో ఎవరెవరో వస్తుండటంతో ఇబ్బందిగా మారుతుందని కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కాలనీలో ఉండే మహిళలు అక్కడ రోడ్డు మీద నుంచి నడిచే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయం రాచకొండ పోలీస్ కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తామని కాలనీ సంక్షేమ సంఘం నాయకులు పేర్కొన్నారు. ఇప్పటికైనా పోలీస్ ఉన్నతాధికారులు స్పందించి ఎల్‌బీనగర్ కామినేని హాస్పిటల్, ఆర్టీసీ కాలనీ, శివగంగ కాలనీ, శరదవైన్స్, సరూర్‌నగర్ పాత రోడ్డు ప్రాంతంలో ఉదయం, సాయంత్రం సమయాల్లో నిఘా ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. రోడ్డుపై నిలబడి అసభ్యకంగా ప్రవర్తిస్తున్న వారిపై కేసులు నమోదు చేసి హోటళ్లు, లాడ్జిలలో నిఘా పెంచాలని కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం..

రోడ్లపై నిలబడి అసభ్యంగా సైగలు చేస్తూ ఇతరులకు ఇబ్బందులు కలిగిస్తున్న వారిపై చర్యలు తీసుకుంటాం. గతంలో అనేక మంది అదుపులోకి తీసుకుని తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశాం. తమ సిబ్బందితో ఆయా ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా ఉంచుతాం.

–ప్రవీణ్‌కుమార్, ఎల్‌బీనగర్ డీసీపీ

రైతు బజార్‌లలో కూరగాయల ధరలు



దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్, వనస్థలిపురం రైతుబజార్‌లలో కూరగాయల ధరల వివరాలు.. టమాటా రూ.27, వంకాయ రూ.28, బెండ రూ.35, పచ్చిమిర్చి రూ.35, కాకరకాయ రూ.20, బీరకాయ రూ.38, కాలీఫ్లవర్ రూ.23, క్యాబేజీ రూ.18, క్యారెట్ రూ.47, దొండ రూ.28, ఆలుగడ్డ రూ.35, ఉల్లిగడ్డ రూ.48, గోకరకాయ రూ.28, దోసకాయ రూ.23, సొరకాయ రూ11, పొట్లకాయ రూ.18, అరటి కాయ రూ.09, చిక్కుడుకాయ రూ.45, చామగడ్డ రూ.35, మునగ రూ.255, చిలుకడ దుంప రూ.55, బీట్‌రూట్ రూ.41, కీర రూ.23, బీన్స్ రూ.45, క్యాప్సికమ్ రూ.55. ఈ ధరలు సోమవారం ఉదయం 9 గంటల వరకు వర్తిస్తాయి.

ప్రమాదకరంగా మ్యాన్‌హోళ్లు

చైతన్యపురి: రహదారులు, రోడ్ల మధ్యలో ఉన్న మ్యాన్‌హోళ్లు ధ్వంసమై ప్రమాదకరంగా మారినా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మ్యాన్‌హోళ్ల ఏర్పాటు చేసేటప్పుడు నాణ్యత పాటించకపోవటం కొన్ని రోజులకే ధ్వంసం అవుతున్నాయని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గడ్డిఅన్నారం డివిజన్ మధురాపురి కాలనీ రోడ్‌నంబర్–4 స్వర్ణకార వీధిలో మూడు మ్యాన్‌హోళ్లు కుంగి ప్రమాదకరంగా మారాయి. ఉన్నతాధికారులు స్పందించి ధ్వంసమైన మ్యాన్‌హోళ్లను మార్చి నూతనంగా ఏర్పాటు చేయాలని కాలనీలవాసులు కోరుతున్నారు.

ఏసీపీకి మంత్రి పరామర్శ



నాగోలు: అనారోగ్యానికి గురై ఎల్‌బీనగర్ కామినేని హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న ఎల్‌బీనగర్ ఏసీపీ కృష్ణయ్యగౌడ్‌ను ఆదివారం మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ పరామర్శించారు. ఏసీపీ ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

సైదాబాద్: ఎస్‌బీహెచ్ స్టాఫ్ హౌసింగ్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఆదివారం గడ్డిఅన్నారంలోని శ్రీవెంకటగిరి కాలనీలోని కార్యాలయంలో నూతన కమిటీ ఏర్పడింది. అధ్యక్షుడిగా రామకృష్ణ, ఉపాధ్యక్షుడిగా పాపిరెడ్డి, కార్యదర్శిగా మురళీధర్, జాయింట్ సెక్రటరీగా రమేష్, సహాయ కార్యదర్శులుగా ఆనంద్, జగన్నాథం, కోశాధికారిగా పీఎం దాదా హయత్‌ఖాన్, సభ్యులుగా శ్రీధర్, ఆనంద్, జానకి, సుధీర్, మధుకర్, రాజేంద్ర ప్రసాద్, అడ్వైజరీ ట్రెజరర్‌గా బాలమురళీకృష్ణ ఎన్నికయ్యారు.

వ్యక్తి అదృశ్యం



మౌగం పృత్వీక్

చైతన్యపురి: ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన చైతన్యపురి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఏఎస్ఐ లక్ష్మినారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తపేటలో నివసించే మౌగం పృత్వీక్ (32) ఇంటి నుంచి బయటకు వెళ్లి రాత్రైనా రాలేదు. తెలిసిన ప్రాంతాలు, స్నేహితులతో ఆరా తీసినా ఫలితం లేకపోవడంతో ఆదివారం కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

అయ్యప్ప భక్తులకు అన్నదానం

మతసామరస్యాన్ని చాటిన ముస్లిం నాయకుడు



అన్నదాత మహ్మద్ అదిల్‌ను సన్మానిస్తున్న అయ్యప్ప భక్తులు

మహేశ్వరం: ముస్లిం నేత అయ్యప్ప మాలధారణ భక్తులకు అన్నదానం చేసి మతసామరస్యాన్ని చాటుకున్నాడు. మతాలు వేరైనా మనుషులందరూ ఒక్కటేనని అయ్యప్ప పూజలో పాల్గొన్నారు. మండల పరిధిలోని చిన్న తూప్ర గ్రామానికి చెందిన కాంగ్రెస్ మైనార్టీ నాయకుడు మహ్మద్ అదిల్ ఆదివారం గ్రామంలో అయ్యప్ప మాల ధరించిన భక్తులకు అన్నదానం(భిక్ష) కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అదిల్ మాట్లాడుతూ.. గ్రామంలో మాల ధారులకు 14 సంవత్సరాలుగా భిక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నానని తెలిపారు. మా గ్రామంలో హిందూ, ముస్లిం అనే తేడా లేకుండా అందరం కలిసిమెలసి అన్నదమ్ముల్లా స్నేహపూర్వకంగా ఉంటామని తెలిపారు. గణేశ్ ఉత్సవాలు, రంజాన్, దసరా, బోనాల పండుగలను అందరం కలిసి జరుపుకొంటామని పేర్కొన్నారు. అనంతరం అయ్యప్ప భక్తులు అదిల్‌ను శాలువాతో ఘనంగా సన్మానించారు.

ఓయూలో మానవ హక్కుల దినోత్సవం



అవార్డును అందుకుంటున శ్రీకాంత్

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో మానవ హక్కుల దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఓయూ ఆర్ట్స్ కాలేజీ న్యూసెమినార్ హాలులో ఓయూ విద్యార్థి జేఏసీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి మానవహక్కుల విద్యార్థి జేఏసీ చైర్మన్ గడ్డం అశోక్ అధ్యక్షత వహించగా యూనివర్సిటీ ఫర్ గ్లోబల్ పీస్ యూఎస్ఏ చైర్మన్ డా.మధుకిషన్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. దేశంలో దళితులు, ఆదివాసులు, దళిత క్రిస్టియన్స్, బహుజనులు, మైనార్టీలపై వివక్షత చూపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో జరుగుతున్న మానవ హక్కుల ఉల్లంఘన అంశాన్ని యూఎన్ఓలో ప్రస్తావించనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం యువ న్యాయవాది ధర్మారపు శ్రీకాంత్‌కు అమెరికన్ ఎక్స్‌లెన్స్ అవార్డును అందచేశారు. కార్యక్రమంలో ఐఆర్ఎస్ డా.ఉషాకిరణ్, ఓయూ విశ్రాంత అధ్యాపకులు ప్రొ.గట్టు సత్యనారాయణ, ప్రొ.నాతనియేలు, డా.తిరుపతయ్య పాల్గొన్నారు.

ఆర్‌కేపురం కార్పొరేటర్ భర్తపై ఎస్సీ, ఎస్టీ కేసు

- బాకీ డబ్బు అడిగినందుకు దాడి చేశాడని పోలీసులకు ఫిర్యాదు
- తమపైనే దాడి చేశాడని ధీరజ్‌రెడ్డి సైతం ఫిర్యాదు



చికిత్స పొందుతున్న హనుమయ్యను పరామర్శిస్తున్న ఆర్.ఎస్ ప్రవీణ్‌కుమార్

చైతన్యపురి/నాగోలు: తనకు బాకీపడ్డ డబ్బు అడిగేందుకు వెళ్లిన కాంట్రాక్టర్, అతనితో వెళ్లిన మరికొందరిని కులం పేరుతో దూషించి దాడి చేశారని ఫిర్యాదు అందడంతో ఆర్.కె పురం కార్పొరేటర్ రాధ భర్త, బీజేపీ నాయకుడు ధీరజ్ రెడ్డిపై ఎస్సీ, ఎస్టీ సహా పలు సెక్షన్ల కింద చైతన్యపురి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. పోలీసులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం పెద్దపల్లికి చెందిన దాసరి హనుమయ్య అనే కాంట్రాక్టర్ ధీరజ్‌రెడ్డికి వచ్చిన సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్యాకేజ్–7 పనులను సబ్ కాంట్రాక్ట్ కింద తీసుకున్నాడు. పనులు పూర్తి చేసిన ప్పటికి తనకు రావాల్సిన బిల్లుల డబ్బులు రూ.31 లక్షలు ఇవ్వక పోవటంతో అడిగేందుకు శనివారం తన స్నేహితులు భాస్కర్, దాసరి కిషన్, కడెం శివాజీ, ఆముదాల నర్సయ్య, వల్లపు వంశీలతో కలిసి ఆర్‌కెపురంలోని ధీరజ్‌రెడ్డి కార్యాలయానికి వెళ్లారు. ఈ విషయంలో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. ఈ క్రమంలో భాస్కర్ అనే వ్యక్తిని ధీరజ్‌రెడ్డి దుర్భాషలాడాడు. హనుమయ్యపై దాడి చేశాడు. అనంతరం రక్తంతో ఉన్న దుస్తులను తీసివేసి మరో దుస్తులు తొడిగి బయటకు పంపించారు. దీంతో బాధితులు హనుమయ్య, భాస్కర్ తదితరులు పోలీస్ స్టేషన్‌కి వెళ్లి ఫిర్యాదు చేయగా..ఈ మేరకు చైతన్యపురి పోలీసులు ధీరజ్‌రెడ్డి పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. కాగా హనుమయ్య తమ కార్యాలయానికి వచ్చి..తన వెంట ఉన్న దళిత మోర్చా నాయకుడు ప్రవీణ్‌కుమార్‌ను కులంపేరుతో దూషించారని ధీరజ్‌రెడ్డి కూడా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో పరస్పరం ఇరువర్గాలపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ధీరజ్‌రెడ్డిని వెంటనే అరెస్టు చేయాలి: ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

కాంట్రాక్టర్ హనుమయ్యపై దాడి చేసిన ఆర్‌కేపురం కార్పొరేటర్ భర్త ధీరజ్‌రెడ్డిని వెంటనే అరెస్టు చేయాలని బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు ఆర్.ఎస్ ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేశారు. బీజేపీ నాయకుల చేతుల గాయపడిన పెద్దపల్లికి చెందిన బీఆర్ఎస్ నాయకురాలు దాసరి ఉష తండ్రి కాంట్రాక్టర్ హనుమయ్య ఎల్‌బీనగర్‌లో ఓ ప్రైవేట్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతుండగా..విషయం తెలుసుకున్న ప్రవీణ్‌కుమార్ ఆస్పత్రికి వచ్చి ఆయనను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హనుమయ్యపై విచక్షణారహితంగా దాడి చేసిన ధీరజ్‌రెడ్డి, అతని అనుచరులను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమిస్తామని హెచ్చరించారు. తనకు న్యాయం జరిగే వరకు పోరాడుతానని దాసరి ఉష పేర్కొన్నారు.

హనుమయ్య అనుచరులే దాడి చేశారు: ధీరజ్‌రెడ్డి

హనుమయ్య తన కార్యాలయానికి వచ్చి అతని అనుచరులతో దాడి చేశాడని బీజేపీ నాయకుడు ధీరజ్‌రెడ్డి తెలిపారు. ఆదివారం మీడియాతో మాట్లాడుతూ హనుమయ్య తనపైన అనవసరమైన ఆరోపణలు చేస్తున్నాడని అన్నారు. తన దగ్గర సబ్ కాంట్రాక్టర్‌గా పనిచేసి పనులు పూర్తి చేయకుండా మధ్యలోనే వదిలేశాడని, పూర్తికాని పనికి డబ్బులు ఇవ్వాలని ఒత్తిడి చేస్తున్నాడని ఆరోపించారు. శనివారం తన అనుచరులతో వచ్చి తన కార్యాలయంపై దాడి చేసి..తనపైనే తప్పుడు కేసులు పెట్టాడన్నారు. దాడిచేసిన తర్వాత కూడా తనకు ఫోన్ చేశాడని, పూర్తి వివరాలు పోలీస్ స్టేషన్‌లో ఇచ్చినట్లు ధీరజ్‌రెడ్డి తెలిపారు.

సీఎంఆర్‌ఎఫ్‌తో పేదలకు లబ్ధి

ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి



ఎల్‌ఓసీ అందజేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

నాగోలు: సీఎం రిలీఫ్ ఫండ్‌తో ఎంతో మంది పేదలకు లబ్ధి చేకూరుతుందని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. కొత్తపేట డివిజన్‌లోని రాజీవ్‌గాంధీనగర్‌లో నివాసముండే నర్సింహాకు సీఎంఆర్‌ఎఫ్ నుంచి మంజూరైన రూ.2 లక్షల ఎల్‌ఓసీ పత్రాలను ఆదివారం బాధితుడి కుమారుడు కిరణ్‌కు ఎమ్మెల్యే అందజేసి మాట్లాడారు. పేదల ఆరోగ్య పరిరక్షణకు సీఎం సహాయ నిధి ఎంతో దోహదపడుతుందని అన్నారు. సీఎంఆర్‌ఎఫ్ పేదలకు ఆర్థిక భరోసా కల్పిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో విఠల్ రెడ్డి, రుద్ర యాదగిరినేత పాల్గొన్నారు.

శివ మార్కండేయ దేవాలయంలో ప్రవచన సప్తాహం

వనస్థలిపురం: తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మ ప్రచార పరిషత్, వనస్థలిపురం భక్త సమాజం ఆధ్వర్యంలో వనస్థలిపురం ఎన్జీవోస్ కాలనీలోని శివ మార్కండేయ దేవాలయంలో ఆదివారం నుంచి ఈ నెల 14వ తేదీ వరకు ప్రవచన సప్తాహం నిర్వహిస్తున్నట్లు అధ్యక్షుడు సీహెచ్‌వీఆర్‌కే.మూర్తి తెలిపారు. ఇందులో భాగంగా ప్రవచనకర్త డా. నారుమంచి శ్రీరామచంద్రమూర్తిచే మహిషాసురమర్ధనీ స్తోత్రం ప్రవచనం నిర్వహించినట్లు ఆయన వెల్లడించారు.

నిద్రించడానికి స్థలం లేదని వాహనాలకు నిప్పంటించాడు



వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

చాదర్‌ఘాట్: రెండ్రోజుల క్రితం చాదర్‌ఘాట్ మెట్రోస్టేషన్ పార్కింగ్ స్థలంలో నిలిపిన వాహనాలు దగ్ధం చేసిన వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. మహారాష్ట్రకు చెందిన జాకీర్ మహ్మద్ (32) ఎనిదేళ్ల క్రితం నగరానికి వచ్చి కూలీ పనులు చేస్తున్నాడు. మద్యానికి అలవాటు పడి ఫుట్‌పాత్‌లపైనే నిద్రిస్తున్నాడు. తాను నిద్రించడానికి పార్కింగ్ వాహనాలు ఇబ్బందిగా మారాయని వాటికి నిప్పంటించాడు. సీసీ ఫుటేజీలను పరిశీలించిన పోలీసులు ఆదివారం అక్బర్‌బాగ్ వద్ద అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు.

ఓయూలో గ్రూప్‌-4 ఉద్యోగుల రిపోర్టింగ్

ఉస్మానియా యూనివర్సిటీ: టీజీపీఎస్సీ ద్వారా కొత్తగా ఎంపికైన గ్రూప్–4 ఉద్యోగులు ఓయూలో రిపోర్టు చేస్తున్నారు. యూనివర్సిటీ మొత్తానికి 375 మంది ఉద్యోగులను కేటాయించగా ఇంత వరకు 127 మంది రిపోర్టు చేశారు. ఓయూ చరిత్రలో తొలిసారి టీజీపీఎస్సీ ద్వారా నాన్‌టీచింగ్ పోస్టులను భర్తీ చేస్తున్నారు. గతంలో వర్సిటీలో తాత్కాలికంగ పని చేసే వారి సీనియర్టీని బట్టి పర్మనెంట్ చేశారు. కానీ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వత వర్సిటీ నియామకాలను రద్దు చేసి రాష్ట్ర ప్రభుత్వం టీజీపీఎస్సీ ద్వారా ఖాళీలను భర్తీ చేయాలని నిర్ణయించారు. అయితే గ్రూప్–4 ఉద్యోగులు వచ్చినంత మాత్రన ఓయూలో గత 27 ఏండ్లు సంవత్సరాలుగా పని చేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులను తొలగించబోమని అధికారులు తెలిపారు. ఇదిలా ఉండగా ఓయూ క్యాంపస్‌తో పాటు అనుబంధ కాలేజీలు నిజాం కాలేజీ, సైఫాబాద్ పీజీ కాలేజీ, సికింద్రాబాద్ పీజీ కాలేజీలు, జిల్లా పీజీ సెంటర్లకు గ్రూఫ్–4 ఉద్యోగులకు పోస్టింగులు ఇవ్వనున్నారు. ఓయూలో చేరే గ్రూఫ్–4 ఉద్యోగులలో ఎగ్జామినేషన్ బ్రాంచ్‌కు అధికంగా 50 మందిని నియమించనున్నారు. ఇతర కార్యాలయాలు, కళాశాలలకు అవసరాలను బట్టి 10 నుంచి 15 వరకు గ్రూప్–4 ఉద్యోగులను కేటాయించనున్నారు

ఆకట్టుకున్న కూచిపూడి ప్రదర్శన



ఉప్పల్: వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా ఉప్పల్ మినీ శిల్పారామంలో ఆదివారం నిర్వహించిన పద్మజ విశ్వాస్ వారి తరంగిణి మ్యూజిక్ అండ్ డాన్స్ అకాడమీ శిష్యబృందంచే నిర్వహించిన కూచిపూడి నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. గాత్ర కచేరి, కీబోర్డు, వయోలిన్ ప్లే లాంటి ప్రదర్శనలు అబ్బుర పరిచాయి. టీవీ ఆర్టిస్ట్ చంద్రశేఖర్ పాల్గొని కళాకారులను అభినందించారు.

11న రాష్ట్ర స్థాయి కార్యవర్గ సమావేశం

నాంపల్లి: తెలంగాణ నాలుగో తరగతి ఉద్యోగుల కేంద్ర సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశం ఈ నెల 11న ఉదయం 11 గంటలకు గృహకల్ప భవన సముదాయంలోని కేంద్ర సంఘం రాష్ట్ర కార్యాలయంలో జరుగుతుందని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొండూరు గంగాధర్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం నాంపల్లిలో ఆయన అధ్యక్షుడు గడ్డం జ్ఞానేశ్వర్‌తో కలిసి విలేకర్లతో మాట్లాడారు. రాష్ట్ర స్థాయి కార్యవర్గ సమావేశం రాష్ట్ర అధ్యక్షుడు గడ్డం జ్ఞానేశ్వర్ అధ్యక్షతన జరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా సమావేశంలో పలు అంశాలపై చర్చించి తీర్మానాలను ఆమోదించడం జరుగుతుందని పేర్కొన్నారు.